క్లుప్తంగా

అథ్లెటిక్స్‌కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ సాములు

బడంగ్‌పేట్: స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2024 ఎంపికను సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో బడంగ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె అర్జున్ పేర్కొన్నారు. అండర్ 14 బాల బాలికల విభాగంలో 4వందల మీటర్లలో బొల్లు యాదగిరి, దాసరి గాయత్రి, వంద మీటర్ల విభాగంలో కార్తిక్ ఎంపికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పీఈటీ సాములు తెలిపారు.

పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతాం



హుడాపార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడాకాలనీ పార్కు పక్కనే ఉన్న చెత్త సేకరణ కేంద్రాన్ని శనివారం జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం డీఈ నీలిమా, ఇన్‌స్పెక్టర్, ఎస్ఎఫ్ఏ సిబ్బందితో కలిసి స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కాలనీవాసులు చెత్తను వేయకుండా అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో చిన్నారులు ఆడుకునేందుకు పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. హార్టికల్చర్, జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో పనులు చేపడతామన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ శ్రీ ఛత్రగిరి లక్ష్మినరసింహా స్వామి ఆలయంలో శనివారం అమావ్యాస సందర్భంగా వైభవంగా పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకలంకరణ చేసి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌తో విద్యార్థులకు మేలు




సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డా.రాజేందర్‌రెడ్డి

మీర్‌పేట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహద పడతాయని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డా.రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మీర్‌పేట గాయత్రినగర్ ఎక్స్‌రోడ్డులోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన 'సైన్స్ ఎక్స్‌పో'ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీన్ ప్రమీల, ప్రిన్సిపాల్ కుముదవల్లి డివిజన్ ఇన్‌చార్జి క్రాంతికుమార్, హరిప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీయొచ్చు డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: విజ్ఞాన సదస్సులతో విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించొచ్చని లోటస్‌ల్యాప్ స్కూల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో అంతరిక్ష 2024 విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ విద్యార్థులు చేసినటువంటి ప్రతీ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రతీ విషయంలోనూ వారితో చర్చిస్తూ ప్రాజెక్టులను చూసి అభినందించారు.



సదస్సును ప్రారంభిస్తున్న డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

పరిహారం అందేనా?

- నియోజకవర్గంలోనే రావిర్యాల పెద్ద చెరువు
- 2020లో వరద..
- నీట మునిగిన పంటలు
- వివరాలు సేకరించిన జాతీయ విపత్తు కమిటీ
- నేటికీ అందని సాయం

తుక్కుగూడ: రావిర్యాల పెద్ద చెరువులో స్థానికంగా చాలా మంది రైతులకు శిఖం భూపట్టాలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి సరియైన వర్షాలు కురువక పోవడంతో చెరువులో చుక్క నీరు లేదు. దీంతో రైతులు వరి, కంది, పత్తి, కూరగాయాలు, మూగజీవాల పోషణ తదితర పనులు చేస్తూ జీవనోపాధి పొందేవారు. 2020 అక్టోబర్ మాసంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి రాత్రికి, రాత్రే వరద రావడంతో అది నీటితో నిండిపోయింది. చెరువులో ఉన్న పంటలు, వ్యవసాయ పరికరాలు మునిగిపోవడంతో పాటు, వందలాంది మూగజీవాలు మృత్యువాత పడి కోట్ల రూపాయల నష్టం రైతులకు కలిగింది. దీంతో రైతన్న ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింది. అదే సమయంలో జాతీయ విపత్తు నివారణ కమిటీ సభ్యులు నీట మునిగిన పంటలను పరిశీలించారు. రైతులు నుంచి నష్టానికి సంబంధించిన వివరాలు సేకరించి నష్ట పరిహారం అంచన వేశారు. అయినా ఇంత వరకు రైతులకు నష్ట పరిహారం అందలేదు. ఈ పంట నష్ట పరిహారంపై రైతన్నలు అనేక మంది అధికారులు, ప్రజాప్రతినిధులకు కలిసి వినతిపత్రం అందజేశారు.

కూలీలుగా మారిన రైతులు..

చెరువులో ఉన్న భూములు ఇప్పటి వరకు నీటిలో ఉండి పోయాయి. దీంతో నాటి రైతులు, ఉపాధి కోసం నేటి దినసరి కూలీగా మారారు. రావిర్యాల పరిసర ప్రాంతంలో పలు పరిశ్రమలకు కూలీ పనికి వెళ్తున్నారు. చెరువులో ఉన్న నీరును తూముల ద్వారా బయటికి విడుదల చేస్తే తాము పంటల సాగు చేసుకుంటామని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికి రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులకు కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేశారు.

చెరువు నీటిని విడుదల చేయాలి

భారీ వర్షాల కారణంగా రాత్రికి, రాత్రే చెరువులోకి నీరు చేరడంతో పంటలు మునిగి, మూగజీవాలు చనిపోయి కోట్ల రూపాయలు నష్ట పోయినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వలేదు. అధికారులు స్పందించి చెరువులో నీరు బయటికి విడుదలు చేస్తే తాము పంటలను సాగు చేసుకుంటాము.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మాజీ ఎంపీ దేవేందర్‌గౌడ్



బహుమతుల ప్రదానం చేస్తున్న అగసార

తుక్కుగూడ: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతశిఖరాలు అధిరోహించాలని మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్, జాతీయ అథ్లెటిక్ క్రీడాకారిణి నందిని అగసారలు సూచించారు. శనివారం శ్రీనగర్‌లోని దేవేంద్ర విద్యాలయ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలను పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లతు బాల్యం నుంచే విద్యార్థి లక్ష్యం ఎంచుకొని అందుకు తగిన విధంగా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. అనంతరం క్రీడా, విద్యా రంగంలో రాణించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల డైరక్టర్ తూళ్ల వీజయేందర్‌గౌడ్, కరస్పాండెంట్ శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి వార్షిక బడ్జెట్ రూ.34,80 కోట్లు



వార్షిక బడ్జెట్ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ 2024–25 వార్షిక బడ్జెట్‌కు పాలక మండలి శనివారం ఆమోదం తెలిపింది. మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొత్తం రూ.34,80,77,000ల అంచనా రూపొందించారు. గతేడాది 28,49,50,000ల బడ్జెట్ ఆమోదించారు. ఈ ఏడాది దాదాపు రూ.6 కోట్ల మేర పెరిగింది. ఈ సమావేశం సందర్భంగా కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి కేటాయింపులు చేయాలని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల కల్పన, నోటరీ డాక్యుమెంట్ల పరిష్కారం విషయంలో విస్తృత స్థాయి సమీక్షా చేశారు. ముఖ్యంగా ఇంటి పన్నులు, కమర్షియల్ పన్నులు వసూలు చేయడంలో స్థానిక కౌన్సిలర్ల సహకారం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ వసంత, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, షేక్ ఫమిదా, రహిమా, లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, శంషూద్దీన్, జాఫర్ బామ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన పెద్దమ్మ జాతర



పుట్ట బంగారం కమ్ముతున్న ఒగ్గు కళాకారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త విఠల్ బాబా పర్యవేక్షణలో సాయంత్రం 5గంటలకు పుట్ట బంగారం కమ్ముట, గంగపూజలను నిర్వహించారు. అనంతరం గ్రామం నుంచి వందలాది మంది భక్తులతో ఊరేగింపును కొనసాగించారు. మున్సిపాలిటీ తరపున అధికారులు ఏర్పాట్లు చేశారు. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ కౌన్సిలర్ బుడుమాల యాదగిరి ఉత్సవాలను పర్యవేక్షించారు. రాత్రి ఒగ్గు కళాకారులచే పెద్దమ్మ తల్లి ఒగ్గు కథను వినిపించారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మాడ్గుల: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని ప్రజాపాలన దరఖాస్తులను గత మూడు రోజులుగా అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తం 16,682 దరఖాస్తులు వచ్చాయి. కాగా ఇందులో రూ.500 సబ్సిడీ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 5,796 మంది తప్పుగా దరఖాస్తు చేసుకున్నారు. తప్పు ఫారాలను పరిశీలించి సరైన వివరాలను గత మూడు రోజులుగా గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీలు, ఆశలు నమోదు చేస్తున్నారు. మండల పరిధిలోని దొడ్లపహాడ్, అప్పారెడ్డిపల్లి, కొలుకులపల్లి,నర్సాయిపల్లి గ్రామాలను శనివారం ఎంపీడీఓ రాఘువు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిటీసీ సభ్యుడు కిషన్ రెడ్డి, గ్రామ కార్యదర్శ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలందరికీ పథకాలు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



దరఖాస్తులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీ స్కీంలకు గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల విద్యుత్ బిల్లులకు రేషన్ కార్డు లింక్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ సర్వీస్, తప్పులను సరిదిద్దడం కోసం, శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆశవర్కర్ల, విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తుల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. త్వరలో మహాలక్ష్మి పథకం కింద రూ.500 కే సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యులు జహంగీర్‌బాబా, ఏఈ నరేందర్, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, శ్రీను, అజ్గర్‌అలీ, రాజేశ్, ఇమ్రాన్‌బాబా, కార్యదర్శి రాఘవేందర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు, నాయకులు

కడ్తాల్: మండలంలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఫల పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యనారాయణ స్వామి వ్రతం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రియాంక శంకర్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీజీఆర్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మహేశ్వర మహాపిరమిడ్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీసెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్, చేగూరి వెంకటేశ్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులకు స్ఫూర్తి ప్రదాత పీవీ

దిల్‌సుఖ్‌నగర్: సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన గొప్ప నాయకుడు, భారతరత్న పీవీ నరసింహారావు అని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాన మంత్రి, దివంగత పీవీ నరసింహారావుకు భారత దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న అవార్డును ప్రకటించిన నేపథ్యంలో శనివారం అల్కాపురి చౌరస్తాలో పీవీ కాంస్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు పీవీ స్ఫూర్తిదాయకమని అని అన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కనీవ్వనర్ బండి మధుసూదన్ రావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్,వెంకటేశ్వర్లు, తలాటి రమేశ్ నేత, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీకృష్ణ మెమోరియల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్‌లో ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ రేస్ తదితర అన్ని విభాగాల్లో తమ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారని శ్రీనివాసపురం కాలనీలోని సెయింట్ ఆన్స్ పాఠశాల చైర్మన్ కుంట్లూరు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. తమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని, తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో ప్రోత్సాహించాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 45, ఆలు 23, ఉల్లి 20, గోకర 45, దోస 18.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

హస్తినాపురం: డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములైతే పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తారని అన్నారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరం పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఇంజినీరింగ్ అధికారులు, ఆయా కాలనీల ప్రజలు, నాయకులు మమత, మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జానకీరామ్‌నాయక్ , రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని, మిషన్ భగీరథ నీళ్లు కూడా సరిపడా సరఫరా అయ్యే అవకాశం ఉండకపోవచ్చని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. శనివారం వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లోని బోరుబావులను వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపైనే ఆధారపడి ఉండొద్దన్నారు. మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు.

నేడు బాలయేసు వార్షికోత్సవం



బాలయేసు పుణ్యక్షేత్రం

- వేలల్లో హాజరుకానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని అద్భుత బాలయేసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. ప్రతి ఏటా ఫిబ్రవరి నెల 2వ వారంలో బాలయేసు మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. శనివారం మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటగా కమ్మగూడలో బాలయేసు పుణ్యక్షేత్రాన్ని నిర్మించారు. దేశంలో ఇది మూడవది. బయట నుంచి చూస్తే ఈ పుణ్యక్షేతం మత్స్య ఆకారంలో కనిపిస్తుంది.

విస్తరణ, పునర్నిర్మాణం....

ఈ క్షేత్రానికి నగరం నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తుల తాకిడి పెరగడంతో 1992లో ఆలయ విస్తరణను చేపట్టారు. 100 అడుగుల ఎత్తులో ధవళవర్ణంతో రెండు గాలిగోపురాలను ఏర్పాటు చేశారు. 150 కిలోల కంచు గంట అమర్చారు. రెండు గాలిగోపురాల మధ్య సింహద్వారం ఉంటుంది. భారతీయ కళా సంపద ఉట్టిపడేలా 70 అడుగుల ఎత్తులో ఒక గుహగోపురం తీర్చిదిద్దారు. నీవు నన్ను ఆరాధిస్తే నేను నిన్ను ఆదరిస్తా అన్న బాలయేసు మాటలను గోడలపై లఖించారు. దేవమాత గుహతో పాటు దర్శించుకునే ప్రదేశాలు ఇక్కడ చాలా ఉన్నాయి. ప్రతి ఏటా మహోత్సవాలకు 50వేలకు పైగా భక్తులు హాజరవుతుంటారు.



ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రెండు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలు

శనివారం ఫా. డేవిడ్ కొప్పుర , సహాయ గురువు, యంజాల తెలుగులో దివ్య బలిపూజ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఫా. పి. జీవన్ బాబు , గంటారాధన, వ్యాఖ్య పరిచర్య, దివ్య బలిపూజ చేశారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బాలయేసు మహోత్సవాలకు ఆర్టీసీ నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఇన్‌ఫాంట్ జీసస్ స్పెషల్ పేరుతో ప్రత్యేక బస్సులను ఆదివారం నడపనుంది. ఎంజీబీఎస్ డిపో, మెహిదీపట్నం, నాంపల్లి, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బస్సులను నడపనున్నారు. ఇప్పటికే చర్చి కమిటీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్ల పూర్తి చేశారు. వనస్థలిపురం పోలీసులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. క్యాతలిక్ హబ్, దివ్యవాణి టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

తాళ్లపల్లిగూడలో 'గావ్ చలో అభియాన్'



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మంచాల: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మండల ఇన్‌చార్జి పాండాల జంగయ్య గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తాళ్లపల్లి గూడ గ్రామంలో 'గావ్ చలో అభియాన్ ' కార్యక్రమం నిర్వహించారు. ఈ జంగయ్య గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులు లేకుండా గ్రామాల్లో ఏ సంక్షేమ పథకం అమలు కావడం లేదన్నారు. గ్రామాల్లోని స్మశాన వాటికలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటడం, ఉపాధిహామీ పథకం కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడుస్తున్నాయని చెప్పారు. రైతు సాధికారత పేరుతో సాంకేతికతను తీసుకొని రావడం జరిగిందన్నారు. ధాన్యానికి మద్దతు ధర పెంపు, పంటల బీమా, ఒకే దేశం- ఒకే ఎరువు వంటి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నూకం రాజు, నాయకులు ఐలయ్య, బండ జయమ్మ, సంతోష్ కుమార్, యాదయ్య, మహేష్, వంశీరెడ్డి, దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సీఐ శివప్రసాద్

కడ్తాల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కల్గిండాలని సీఐ శివప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రావిచేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9,10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో కుటుంబ బాధ్యత, క్రమశిక్షణ, సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను పరిమితికి మించి వాడొద్దని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తతో ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేరాలు, నైతిక విలువలు, విద్యార్థులు క్రమశిక్షణ, కుటుంబ బాధ్యత, సైబర్ క్రైమ్స్, చట్టాలు, ఉన్నత లక్ష్యాల తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, భారతమ్మ, విద్యాకమిటీ చైర్మన్ రవీందర్, హెచ్ఎం సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివప్రసాద్